## క్లుప్తంగా

### అన్ని పండులకు సమ ప్రాధాన్యం



చెక్కులు అందజేస్తున్న షేక్ అక్బర్

మలక్‌పేట: ప్రభుత్వం అన్ని వర్గాలకు సముచిత ప్రాధాన్యం ఇస్తుందని కాంగ్రెస్ పార్టీ మలక్‌పేట ఇన్‌చార్జి షేక్‌అక్బర్ అన్నారు. ప్రభుత్వం అందజేస్తున్న బోనాల చెక్కులను ఆలయ నిర్వాహకులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆలయాల సుందరీకరణ కోసం ప్రభుత్వం నిధులు మంజూరు చేసిందన్నారు. ప్రభుత్వ పథకాలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ధర్మేందర్, మదన్‌బాబు, బాబు శ్రీను, అశ్వక్‌ఖాన్ పాల్గొన్నారు.

### రేషన్‌కార్డులకు దళారులను ఆశ్రయించొద్దు



నర్సింగ్‌రాజు

చాదర్‌ఘాట్: రేషన్ కార్డుల కోసం ఎవరూ దళారులను ఆశ్రయించ వద్దని మలక్‌పేట ఏఎస్‌ఓ నర్సింగ్‌రాజు ఓ ప్రకటనలో సూచించారు. మీసేవా కేంద్రంలో దరఖాస్తు చేసుకొని తమ ఆఫీస్‌లో ఇవ్వాలని ఆ ఏరియా ఇన్‌స్పెక్టర్‌తో పరిశీలన జరిపి ప్రభుత్వ నిబంధనలకు అనుసరించి అర్హులైన ప్రతి కుటుంబానికి రేషన్‌కార్డు మంజూరు చేస్తామన్నారు.

### యువత క్రీడల్లో రాణించాలి



క్రీడాకారిణులకు నగదు అందజేస్తున్న శ్రీనివాస్‌గుప్తా

నాగోలు: యువత క్రీడల్లో రాణించాలని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి ఉప్పల శ్రీనివాస్ గుప్తా పేర్కొన్నారు. బ్యాడ్మింటన్ అండర్-13 డబుల్స్ విభాగంలో నేషనల్ బ్యాడ్మింటన్ పోటీలకు ఎంపికైన పొద్దుటూరి అన్య, వైభవ్ రమ్యకు మంగళవారం ఆయన నాగోలులోని తన నివాసంలో సన్మానించి ఒక్కొక్కరికి రూ. 10 వేల నగదు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జాతీయ స్థాయిలో ప్రతిభ కనబరిచిన తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని కోరారు.

### ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి



మొక్కలు నాటుతున్న విద్యార్థులు

చంపాపేట: ప్రతి ఒక్కరూ ఒక మొక్కను నాటి వాతావరణ కాలుష్య నివారణలో భాగస్వాములు కావాలని చంపాపేట చౌరస్తాలోని రవీంద్ర భారతీ గ్లోబల్ పాఠశాల ప్రిన్సిపల్ సరిత అన్నారు. మంగళవారం వనమహోత్సవం కార్యక్రమంలో భాగంగా ఆమె ఆధ్వర్యంలో మొక్కల పెంపకంపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం పాఠశాల ఆవరణలో మొక్కలు నాటి వాటి సంరక్షణ బాధ్యత తమదే అని ప్రతిజ్ఞ చేశారు.

### నూతన కమిటీ ఎన్నిక



కమిటీ సభ్యులను సన్మానిస్తున్న పవన్‌కుమార్

నాగోలు: కాలనీ అభివృద్ధిలో కాలనీ సంక్షేమ సంఘం నాయకుల పాత్ర కీలకమని కొత్తపేట డివిజన్ కార్పొరేటర్ నాయికోటి పవన్‌కుమార్ అన్నారు. కొత్తపేట డివిజన్ శ్రీరామలింగేశ్వర కాలనీలో సంక్షేమ సంఘం నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మంగళవారం అసోసియేషన్ కార్యాలయంలో కాలనీ అధ్యక్షులు సుధాకర్, ఉపాధ్యక్షులు కుమార్, అశోక్ చారి, జనరల్ సెక్రటరీ శ్రీనివాసరావు, ట్రెజరర్ వేణుగోపాల్, కాలనీ సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు.

### ఎల్లమ్మతల్లికి ప్రత్యేక పూజలు

తుక్కుగూడ: మున్సిపల్ పరిధిలోని సూర్యగిరి ఎల్లమ్మకు మంగళవారం ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారికి ఇష్టమైన రోజు కావడంతో దర్శనం కోసం భక్తులు బారులుతీరారు. అనంతరం బోనం సమర్పించి, మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ ప్రాగణంలో సామూహిక సత్యనారాయణస్వామి వ్రతాలు చేశారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ రెడ్డి గళ్ల రత్నం, ఈఓ మోహన్‌రావు, సిబ్బంది మీగడ కాశీనాథ్, పూజారులు పాల్గొన్నారు.

# రాజన్నా.. నిను మరువలేమన్నా..



ఎల్‌బీనగర్‌లో వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పిస్తున్న బీఆర్‌ఎస్ నాయకుడు, వైఎస్సార్ అభిమాని మామిడి రాంచందర్



ఎల్‌బీనగర్, మలక్‌పేట నియోజకవర్గాల్లో దివంగత ముఖ్యమంత్రి వై.ఎస్ రాజశేఖర్‌రెడ్డి జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. పార్టీలకతీతంగా ఆయా ప్రాంతాల్లోని వైఎస్సార్ విగ్రహాలు, కూడళ్లలో చిత్రపటాలు ఏర్పాటు చేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. వివిధ సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి పేదల జీవితాల్లో వెలుగులు నింపిన మహా నేత వైఎస్సార్ అని కొనియాడారు.

– ఎల్‌బీనగర్, మలక్‌పేట జోన్ల బృందం



చిత్రలేఔట్‌లోని వైఎస్ఆర్ విగ్రహానికి నివాళి అర్పిస్తున్న దేప భాస్కర్‌రెడ్డి



వైఎస్ రాజశేఖర్‌రెడ్డితో జక్కిడి శివచరణ్‌రెడ్డి (ఫైల్)

### నాటి మధురస్మృతులు

మన్సూరాబాద్: మహానేత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి జయంతిని పురస్కరించుకుని యువజన కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు జక్కిడి శివచరణ్‌రెడ్డి నాటి మధుర స్మృతులను గుర్తు చేసుకున్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ పీసీసీ అధ్యక్షుడు హోదాలో వైఎస్ రాజశేఖర్‌రెడ్డి 1998లో సూర్యాపేటలోని సభకు వెళ్లు మార్గమధ్యలో మన్సూరాబాద్‌లో కాసేపు ఆగారు. నాడు మలక్‌పేట్ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా ఉన్న జక్కిడి ప్రభాకర్‌రెడ్డి నివాసంలో భోజనం చేశారు. ఆ సమయంలో చిన్నపిల్లాడిగా ఉన్న నేటి యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు జక్కిడి శివచరణ్‌రెడ్డిని వైఎస్ రాజశేఖర్‌రెడ్డి తనపై కూర్చుబెట్టుకున్నాడని నాటి మధుర స్మృతులను గుర్తు చేసుకున్నారు.



వైఎస్ రాజశేఖర్‌రెడ్డి చిత్రపటానికి శ్రద్ధాంజలి ఘటిస్తున్న శశిధర్‌రెడ్డి



కర్మన్‌ఘాట్‌లో వైఎస్సార్ విగ్రహానికి నివాళి అర్పిస్తున్న శ్రీపాల్‌రెడ్డి



వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న శశిధర్‌రెడ్డి



కర్మన్‌ఘాట్‌లోని ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు పండ్లు పంపిణీ చేస్తున్న ఆల వెంకట్‌రెడ్డి



ఎల్‌బీనగర్‌లో వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న టీపీసీసీ ప్రతినిధి జక్కిడి ప్రభాకర్‌రెడ్డి

## సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి



కార్యక్రమంలో పాల్గొన్న నర్సింహారెడ్డి

చాదర్‌ఘాట్: ప్రతి ఒక్కరు సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని మలక్‌పేట ఏసీపీ సుబ్బరామిరెడ్డి, మార్కెట్ ఎస్‌జీఎస్ చిలక నర్సింహారెడ్డి పేర్కొన్నారు. మంగళవారం మలక్‌పేట మార్కెట్ కార్యాలయంలో వారు వ్యాపారులతో సమావేశం ఏర్పాటు చేశారు. వ్యాపారులు తమ తమ దుకాణాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. షాపుల్లో పనిచేసే సిబ్బందికి గుర్తింపు కార్డులు ఇవ్వాలని, సెక్యూరిటీ గార్డులు యూనిఫామ్ ధరించాలని తెలిపారు. ఇటీవల మార్కెట్‌లో ఓ షాపు వద్ద రూ. 6.50 లక్షల నగదు దొంగతనం కేసులో నిందితుడి అదుపులోకి తీసుకొని నగదు స్వాధీనం చేసుకున్నారు. అందుకు గాను ఏసీపీ సుబ్బరామిరెడ్డి, ఇన్‌స్పెక్టర్ బ్రహ్మ మురారిను ఎస్ జీఎస్ సన్మానించారు. ఈ కార్యక్రమంలో చేగూరి వెంకట రమణ, డైరెక్టర్లు కిషన్‌సింగ్, కృష్ణ, వ్యాపారులు శంకర్, రమేష్, బాలాజీ, అశోక్, శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

## నేటి నుంచి గురుపౌర్ణమి వేడుకలు



ఆహ్వాన పత్రికలను ఆవిష్కరిస్తున్న కమిటీ సభ్యులు

చైతన్యపురి: దక్షిణ షిరిడీగా ప్రసిద్ధి చెందిన దిల్‌సుఖ్ నగర్‌లోని సాయిబాబా ఆలయంలో బుధవారం నుంచి మూడ్రోజుల పాటు గురుపౌర్ణమి మహోత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ చైర్మన్ బీవీ. శ్యామ్‌కుమార్ తెలిపారు. ఉత్సవాలకు సంబంధించిన ఆహ్వాన పత్రాలను మంగళవారం విడుదల చేసిన అనంతరం వివరాలు వెల్లడించారు. బుధవారం ఉదయం 9గంటలకు శ్రీసాయి లక్ష పుష్పార్చన, గురువారం ఉదయం 6 గంటలకు 108 వెండి కలశాలతో బాబావారికి పవిత్ర నదీజలములు, పంచామృతాలతో అష్టోత్తర శత కలశాభిషేకం, 8 గంటలకు శ్రీగురు చరిత్ర పారాయణం, శుక్రవారం సాయంత్రం 7 గంటలకు బాబా వారి పల్లకి ఊరేగింపు ఉంటుందన్నారు.

## ఘనంగా వార్షికోత్సవం



పూజల్లో పాల్గొన్న కమిటీ సభ్యులు

చంచల్‌గూడ: కుర్మగూడ డివిజన్ కుర్మగూడ బస్తీలోని మహంకాళి (మూడు గుళ్లు) ఆలయ 19వ వార్షికోత్సవం మంగళవారం ఘనంగా నిర్వహించారు. తెల్లవారుజాము నుంచి అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు, అర్చనలు జరిపారు. ఆలయ ప్రధాన అర్చకురాలు శ్రీదేవి ఆధ్వర్యంలో దంపతులు సుదర్శన, చండీ హోమం నిర్వహించారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు సహదేవ్‌యాదవ్ ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తులకు ప్రసాద వితరణ జరిగింది. ఈ కార్యక్రమంలో సుభాష్‌చందర్‌జీ, రవీందర్‌రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, కమిటీ సభ్యులు బర్ల శ్రవణ్‌కుమార్, సూరి, సాయిబాబా, వెంకట్‌రెడ్డి, సూర్యకిరణ్, నర్సింహా, నాగరాజు, విశాల్, దీపక్, వాసు పాల్గొన్నారు.

## ఘనంగా దక్షణామూర్తి యాగం



యాగం నిర్వహిస్తున్న వేద బ్రాహ్మణులు

నాగోలు: దేశ ప్రజలందరూ సుఖశాంతులతో ఉండాలని కోరుతూ లోక కళ్యాణ కోసం జగద్గురు సేవా సమితి ఆధ్వర్యంలో నాగోలులోని శ్రీ అభయాంజనేయ స్వామి దేవాలయంలో గత మూడు రోజులుగా 21 మంది ఋత్వికులతో వేద బ్రహ్మ శ్రీ బెట్టూరి ప్రసన్నాచార్యులు వారి శిష్య బృందం ఆధ్వర్యంలో శ్రీ దక్షిణామూర్తి యాగం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. జగద్గురు సేవా సమితి ఆధ్వర్యంలో గత పది సంవత్సరాలుగా దక్షిణామూర్తి యాగాలు, మహారుద్ర యాగం, అతిరుద్ర యాగాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

### నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవు



ఆటోడ్రైవర్‌కు అవగాహన కల్పిస్తున్న రాము

మలక్‌పేట: పరిమితికి మించి పల్లలను ఆటోలలో తీసుకెళ్తే చర్యలు తప్పవని మలక్‌పేట ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ అశోక్‌కుమార్ హెచ్చరించారు. మంగళవారం ఆయన ఆధ్వర్యంలో స్పెషల్ డ్రైవ్ చేపట్టారు. కాలుష్యాన్ని వెదజలుతున్న లారీ, పరిమితికి మించి విద్యార్థులను తీసుకెళ్తున్న ఆటోను స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని పిల్లలను క్షేమంగా ఇంటికి చేర్చాల్సిన బాధ్యత ఆటో డ్రైవర్లదే అన్నారు.

### ప్రత్యేక పూజలు

మలక్‌పేట: మూసారంబాగ్ శ్రీ విఠల్ రుక్మాబాయి దేవాలయంలో ఆషాఢ మాస ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.. ఈ సందర్భంగా బీఆర్‌ఎస్ నియోజకవర్గ నాయకుడు ఎం. శ్రీధర్‌రెడ్డి, అక్బర్‌బాగ్ డివిజన్ అధ్యక్షుడు మంచికంటి జగన్‌గుప్తా ఉత్సవాలకు హాజరై అమ్మవారికి అభిషేకం, ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ నిర్వాహకులు వారిని సన్మానించారు. కేంద్రీయ సమితి తెలంగాణ మరాఠ సమాజం అధ్యక్షుడు సుందర్‌రావ్ వాగ్‌మారే, ఉపాధ్యక్షుడు రాజేష్ వాగ్‌మారే, ప్రధాన కార్యదర్శి నితేష్ రావ్ జోగ్‌డే, సంయుక్త కార్యదర్శి అశోక్ రావ్ సదాపలే, కోశాధికారి లక్ష్మణ్‌రావ్ కాంబ్లే పాల్గొన్నారు.

## లేబర్‌కోడ్‌లను రద్దు చేయాలి



సమ్మెకు సహరించాలని కోరుతున్న సీఐటీయూ నేతలు

మన్సూరాబాద్: లేబర్ కోడ్‌లతో కార్మికులు బానిసలుగా మారుతున్నారని వెంటనే రద్దు చేయాలని సీఐటీయూ రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షుడు కీసరి నర్సిరెడ్డి డిమాండ్ చేశారు. మన్సూరాబాద్ డివిజన్ హయత్‌నగర్ పరిధి కుంట్లూర్ రోడ్డులోని ఆటో స్టాండ్ వద్ద మంగళవారం సమావేశం నిర్వహించి సమ్మెను సహకరించాలని కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బుధవారం జరిగే సమ్మెలో ఆటో కార్మికులందరు స్వచ్ఛందగా పాల్గొనాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం ఆటో కార్మికులకు రూ.12వేలు ఇస్తానన్న వాగ్దానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. మహిళలు ఉచిత బస్సు పథకంతో ఆటో కార్మికులు అప్పుల్లో కూరుకుపోయారని, రాష్ట్ర ప్రభుత్వం ఆటో కార్మికులకు ఆదుకోవాలన్నారు.

## ప్రభుత్వ పాఠశాలలో నాణ్యమైన విద్య



యూనిఫామ్స్ అందజేస్తున్న వరలక్ష్మి, శ్రీనివాస్ రెడ్డి.

నాగోలు: ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య ఉంటుదని నాగోలు జైపురికాలనీ అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్ పర్సన్ వరలక్ష్మి అన్నారు. మంగళవారం ప్రధానోపాధ్యాయుడు బత్తుల శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో తల్లిదండ్రులు ఉపాధ్యాయుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వరలక్ష్మి మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాల్లో మంచి సౌకర్యాలతో పాటు నాణ్యమైన విద్య అందిస్తారని దాతల సహకారంతో విద్యార్థులకు అన్ని విధాలుగా సేవలు అందిస్తున్నారన్నారు. బత్తుల శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ.. తల్లిదండ్రులు పిల్లలను ప్రతిరోజూ పాఠశాలలకు పంపించాలన్నారు. అనంతరం విద్యార్థులకు యూనిఫామ్స్ అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు అనంత రెడ్డి, మేరీ బ్యూలా, గాయత్రి, రాజేశ్వరి, రమాదేవి పాల్గొన్నారు.

### గంజాయి విక్రయానికి యత్నం

ఇద్దరి రిమాండ్

నాగోలు: గంజాయి విక్రయానికి పాల్పడుతున్న ఇద్దరిని రిమాండ్‌కు తరలించారు. ఎల్‌బీనగర్ పోలీసుల వివరాల ప్రకారం..ఖమ్మంజిల్లా, బోనకల్ మండలం, రాయన్నపేట గ్రామానికి చెందిన యంగల నరేంద్ర(25) నిజాంపేట, జర్నలిస్ట్ కాలనీలో ఉంటూ కారు డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. యాదాద్రి, భువనగిరి జిల్లా, మోత్కూర్ గ్రామానికి చెందిన కొంతం నితిన్ అలియస్ చింటూ(32) ఇంద్రహిల్స్ కాలనీ దగ్గర ఉంటూ చదువుకుంటున్నారు. ఇద్దరు స్నేహితులు కలిసి ఒరిస్సా నుంచి గంజాయి తీసుకుని వచ్చి సోమవారం రాత్రి ఎల్‌బీనగర్ మెట్రో స్టేషన్ సవేర వైన్స్ దగ్గర విక్రయించే యత్నం చేస్తుండగా పోలీసులు ఇద్దరిని అరెస్టు చేసి 1182 గ్రాముల గంజాయి స్వాధీనం చేసుకున్నారు.

## ఆలయాభివృద్ధికి ధర్మకర్తలు కృషి చేయాలి



ధర్మకర్తలకు నియామక పత్రాలు అందజేస్తున్న సిరిసిల్ల రాజయ్య, మధుయాష్కిగౌడ్

లింగోజిగూడ: దేవాలయ అభివృద్ధికి నూతన ధర్మకర్తలు కృషి చేస్తూ, మెరుగైన సదుపాయాల కోసం సమష్టి నిర్ణయాలతో ముందుకెళ్లాలని రాష్ట్ర ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ సిరిసిల్ల రాజయ్య, టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కిగౌడ్ సూచించారు. ఎల్‌బీనగర్ శ్రీ ప్రసన్నంజనేయ స్వామి దేవాలయ నూతన ధర్మకర్తల ప్రమాణ స్వీకరోత్సవ కార్యక్రమానికి వారు హాజరై మాట్లాడారు. ప్రభుత్వం, దేవాదాయ శాఖ తరఫున ఆలయాల అభివృద్ధికి సహాయ సహకారాలు అందజేస్తామన్నారు. ప్రజల్లో ఆధ్యాత్మిక భావాలు పెంచేందుకు ఆలయాలు ఎంతగానో ఉపయోగపడుతాయన్నారు. బోనాల పండుగా ఘనంగా నిర్వహించేందుకు త్వరలో దేవాలయల కమిటీలకు చెక్కుల పంపిణీ చేస్తామన్నారు. నూతన ధర్మకర్తలుగా తీగుళ్ల యాదగిరి, సాయికుమార్, భవాని శంకర్, బాలకృష్ణ, పార్వతి, భరత్‌కుమార్ యాదవ్, జాలె వెంకట్‌రెడ్డి, దేవిక, ఉదయశ్రీ, స్వప్న ప్రమాణ స్వీకారం చేశారు.

**లింగోజిగూడకు ప్రాతినిథ్యం లేదా?**

ఎల్‌బీనగర్ ప్రసన్నంజనేయ స్వామి దేవాలయం లింగోజిగూడ డివిజన్ పరిధిలోకి వస్తుందని కమిటీలో లింగోజిగూడ డివిజన్ కాంగ్రెస్ నాయకులకు తగిన ప్రాధాన్యం ఇవ్వకపోవడం పట్ల కాంగ్రెస్ నాయకులు గుర్రుగా ఉన్నట్లు సమాచారం. ప్రమాణ స్వీకర కార్యక్రమానికి స్థానిక కార్పొరేటర్ దర్పల్లి రాజశేఖర్‌రెడ్డి హాజరుకాక పోవడంతో ఈ వాదనకు మరింత బలం చేకూరుతుంది. లింగోజిగూడ డివిజన్‌లో ఉన్న దేవాలయానికి డివిజన్ ఒక్కరికి కూడా దేవాలయ కమిటీలో చోటు దక్కక పోవడంపై కాంగ్రెస్ కార్యకర్తలు, నాయకులు కార్పొరేటర్ దర్పల్లి రాజశేఖర్‌రెడ్డిని నిలదీసినట్లు సమాచారం.